


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 140 | 13-08-2026 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00



## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు.

2





# ఆర్మీ ఉద్యోగాలకు యువతను సిద్ధం చేస్తాం..

2లో

**తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం**

**లెఫ్టినెంట్ జనరల్‌తో సీఎం రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు



## రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు.

2



2

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

**ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ**



2

## చర్చకు తానెప్పుడూ సిద్ధమే

**చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ**

## నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

**వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం**

**అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**



2

తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు.



2

## మహారాష్ట్ర సిఎస్‌తో సంజయ్ జాజు భేటీ

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ?2047' విజన్ తదితర అంశాలను వివరించారు.



2

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

**మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు.

## చంద్రబాబు విజినరీ లీడర్

**ఎంపి కలిశెట్టితో రాష్ట్రపతి ముర్ము**

న్యూఢిల్లీ,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని.. అభివృద్ధికి అసలైన చిరునామా అంటూ కొనియాడారు. ఏ పని చేపట్టినా అద్భుతంగా చేయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. నిరంతర శ్రమ, దార్శనికత కలిగిన చంద్రబాబు.. నిజమైన అభివృద్ధికి చిరునామా అని అభివర్ణించారు. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబం కలిసింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌కు 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను ఎంపీ అందజేశారు. పుస్తకంలోని ఫొటోలను ముర్ము ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగానే ఏపీ సీఎంపై ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాకుండా, 'అప్పలనాయుడిని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లే ఉంది' అని రాష్ట్రపతి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరుపై ఎంపీని ద్రౌపది ముర్ము అభినందించారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

## బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు. 'సభ సభ్యులందరూ సమానమే. ఒక ఎంపీపై ఆరోపణలు వచ్చాయి కాబట్టి వారికి తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాము' అని అన్నారు.

# మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

## ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ




న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# చర్చకు తానెప్పుడూ సిద్ధమే

## చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం

## హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ

న్యూఢిల్లీ,

పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# ఆర్మీ ఉద్యోగాలకు యువతను సిద్ధం చేస్తాం..

## తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం

## లెఫ్టినెంట్ జనరల్‌తో సీఎం రేవంత్



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

## వాటాల్లో బీఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం

## అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్

## మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

## మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ

## మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ–రన్.. ఫ్యామిలీ–డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷–లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# మహారాష్ట్ర సిఎస్‌తో సంజయ్ జాజు భేటీ

## తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ

హైదరాబాద్,

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ?2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ–మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

# డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

## మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం

## డిఫాల్టర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి

## పౌరసరఫరాల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం






హైదరాబాద్,

సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు. అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# పతిపక్షాలది అరాచక మనస్తత్వం: బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్

ఢిల్లీ,

పార్లమెంట్ సమావేశాలను వరుసగా అడ్డుకుంటూ, కీలకమైన ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా విపక్షాలు వ్యవహరిస్తున్న తీరుపై అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రతిపక్షాల ఈ ధోరణి వారి 'అరాచక మనస్తత్వాన్ని' ప్రతిబింబిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు.ప్రతిపక్షాల తీరుపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన నితిన్ నబీన్.. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతీ ముఖ్యాంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్షాలు సభను నడవనీయకుండా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రజలందరూ ఈ పరిణామాలను గమనిస్తున్నారని, చర్చల నుంచి ఎవరు పారిపోతున్నారో దేశ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు.

# గ్రూప్ 2 ట్రైనీ ఆఫీసర్లకు వైద్యశాఖ కార్యక్రమాలపై అవగాహన...

మెదక్,ఆగస్టు 12(అక్షర కలం):



జిల్లాలోని వివిధ శాఖల కార్యక్రమాలపై ట్రైనింగ్ లో భాగంగా ఈ రోజు సర్దానా పి.హెచ్.సి. పరిధిలోని ఘన్పూర్ హవేలీ ని గ్రూప్ 2 ట్రైనీ ఆఫీసర్లు ( తహశీల్దార్లు) సందర్శించి పి.హెచ్.సి.ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పి.హెచ్.సి. సిబ్బంది విధులు, ఆశ కార్యకర్త సేవలు, ఏ.ఎన్.ఎం, సూపర్వైజర్, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ ల విధి విధానాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న నిరంతర సేవల గురించి హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఎస్. మదన్ మోహన్ వివరంగా తెలియజేశారు. ఎం.ఎల్.హెచ్.పి. అర్. సమదానిక, హెల్త్ సూపర్వైజర్ టి.ఏ.సునంద, ఏ.ఎన్.ఎం.సునీత, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు

అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 12:

సిద్దిపేట నియోజకవర్గం లోని నంగునూరు మండలంలో వెంకటాపూర్ గ్రామానికి చెందిన తడకపల్లి మనోజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబాన్ని అదేవిధంగా గ్రామానికి చెందిన తడకపల్లి అంజయ్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జేపీ తండా గ్రామానికి చెందిన గణేష్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పాలమాకుల గ్రామానికి చెందిన సంపంగి ఎల్లయ్య, అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజు వార్డ్ మెంబర్ వాళ్ల





నాన్న పోతుల రామచంద్రం మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబాన్నికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జరిగింది. ఇటీవల రాజగోపాల్ పేట్ గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదంలో చెందిన కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నంగునూరు మండలం బి ఆర్ ఎస్ నాయకులు, బి ఆర్ స్ వి నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించాలి: అదనపు కలెక్టర్ మధు మోహన్

గద్వాల్ టౌన్ అక్షర కలం:

హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణకు సరైన అవగాహనే తొలి అడుగని, ప్రతి ఒక్కరూ వాస్తవ సమాచారాన్ని సమాజానికి చేరవేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ



నిర్వహించారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్, బ్రేక్ ఫ్రీ పోస్టర్లను ఆవిష్కరించి యువతకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీపై ఉన్న అపోహలు, భయాలను తొలగించి ప్రజలకు సరైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనుమానం ఉన్నవారు ఎలాంటి సంకోచం లేకుండా పరీక్షలు, కౌన్సెలింగ్, వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిని వివక్షకు గురిచేయకుండా మానవతా దృక్పథంతో చూడాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవగాహన, పరీక్షలు, కౌన్సెలింగ్, చికిత్సా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడం ద్వారా సమాజంలో మరింత అవగాహన తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు తెలిసిన యువతే.. సమాజానికి దిక్సూచి

## అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన

కరీంనగర్, ఆగస్టు12( అక్షర కలం ):

చట్టాలపై అవగాహన, రాజ్యాంగ విలువల పట్ల గౌరవం కలిగిన యువతే న్యాయబద్ధ సమాజానికి దిక్సూచిగా, బలమైన ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తారని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యుడు, న్యాయవాది ఏ. కిరణ్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ గారి అనుమతితో, ఇన్‌చార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీమతి కే. రాణి గారి ఆదేశాల మేరకు పేస్



కంప్యూటర్ అకాడమీలో యువతకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాధికార యువత -- బలమైన భారత్" ఇతివృత్తంతో జాగృతి పథకం-2025 లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, పెరుక రంగయ్య, ప్యానెల్ న్యాయవాది భాశెట్టి సమతా రాణి, పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ చైర్మన్ జంజిరాల వేణు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతకు హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కుపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు, సోషల్ మీడియా దుర్వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ర్యాగింగ్ చట్టం-2012, బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, జువెనైల్ జస్టిస్ చట్టం-2015, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం చట్టం-1985 వంటి ముఖ్యమైన చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను లేదా హెల్ప్ లైన్ 15100 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన వారికి న్యాయ సేవల అధికార సంస్థల చట్టం-1987 ప్రకారం ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాతో పాటు లోక్ అదాలత్, పర్మినెంట్ లోక్ అదాలత్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యువత తమ హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని న్యాయవాదులు సూచించారు. కార్యక్రమంలో పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సిబ్బంది, శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అధికారి రాధిక

గద్వాల్ టౌన్ అక్షర కలం:



గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా ఆర్టీఏ అధికారి శ్రీమతి రాధిక, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖకు సంబంధించిన పలు అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యే రవాణా శాఖ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆగస్టు 31లోగా చేయూత పెన్షన్ల పూర్తి డేటా సేకరణ

జమ్మికుంట, ఆగస్టు 12 ( అక్షర కలం ):



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో చేయూత పెన్షన్లకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను ఆగస్టు 31, 2026లోగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశించారు.జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ జి. మల్లికార్జున స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, ప్రతి వార్డులో కౌన్సిలర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి చేయూత పెన్షన్లపై వివరాలు సేకరించాలని సూచించారు.
ప్రతి వార్డులో పెన్షన్ అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పొందని వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని తెలిపారు.చేయూత పెన్షన్లలో వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన వారు ఎవరైనా పెన్షన్ పొందకుండా ఉన్నట్లయితే వారిని గుర్తించి, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక పెన్షన్ దరఖాస్తు కేంద్రం ఏర్పాటు చేయడమైనది.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి, ఎలాంటి అర్హుడు కూడా పథకానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, ఆగస్టు 12 (అక్షర కలం):



2025--26 వానాకాలం, రబీ సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా రైస్ మిల్లర్లను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సీఎంఆర్‌ను పూర్తి చేసి, ఎఫ్‌సీఐ గోదాములకు తరలించి భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి నర్సింగరావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్‌తో కలిసి రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు పూర్తయిన సీఎంఆర్, మిగిలిన పరిమాణంపై వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్‌సీఐ గోదాములకు బియ్యం తరలింపులో జాప్యం లేకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రైల్వే వ్యాగన్లు అందుబాటులోకి వచ్చిన వెంటనే బియ్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రియాంక కుటుంబానికి అండగా ఎమ్మెల్యే విజయుడు న్యాయం కోసం కేటీఆర్ భరోసా

గద్వాల్ టౌన్ అక్షరకలం:

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన డాక్టర్ ప్రియాంక కుటుంబాన్ని ఆలంపూర్ ఎమ్మెల్యే శ్రీ విజయుడు బుధవారం పరామర్శించారు. ప్రియాంక చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ, ప్రియాంకను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కలిసి రూ.2 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ప్రియాంక మృతికి కారణమైన వారిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, వారికి గట్టి శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కే. తారక రామారావు (కేటీఆర్)తో ఎమ్మెల్యే విజయుడు ఫోన్ ద్వారా ప్రియాంక కుటుంబ సభ్యులతో



మాట్లాడించారు. కేటీఆర్ మాట్లాడుతూ, కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంక మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, వైస్ చైర్మన్ మాల నర్సింహులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ లాంఛనాలతో ఉద్యోగి అంత్యక్రియలు

## నివాళ్లు అర్పించిన కలెక్టర్, డీఎఫ్వో, ఎమ్మెల్యే

## ప్రభుత్వం ద్వారా త్వరితంగా బెనిఫిట్స్

అక్షర కలం/ కారేపల్లి:

కారేపల్లి: విద్యుత్ తో అడవి జంతువుల వేటను అడ్డుకోవటానికి వెళ్లి వేటగాళ్లు పెట్టిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ అంత్యక్రియలు బుధవారం సింగరేణి మండలం వెంకట్యాతండాలో జరిగింది. సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్, వెంకిట్యాతండా సర్పంచ్ బానోత్ బూలీ ల చిన్న కుమారుడైన నవీన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రేంజ్ పరిధిలోని చెరువు సింగారం వేస్ట్ బీట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం అక్కడి బదిలీ కావటం అక్కడ విధి నిర్వాహణలో మృతి చెందటంతో మండలంలో విషాధచ్ఛాయలు నెలకొన్నాయి. మృతదేహాన్ని ఖమ్మం జిల్లా కలెకట్ర్ దివాకర టీ.ఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్వో సిదార్ధ విక్రమ్ సింగ్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సందర్శించి నివాళ్లు అర్పించారు. విధి నిర్వాహణలో మృతి చెందిన నవీన్ కుటుంబానికి అన్ని విధాల అదుకుంటామని అధికారులు, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా, అటవీశాఖ ద్వారా అందాల్సిన బెనిఫిట్స్ ను త్వరితగతిన అందేలా చూడాలని, విధి నిర్వాహణలో మృతి చెందితో రూ.కోటి ఇస్తామన్నా సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కుటుంబ సభ్యులు వివిధ పార్టీలనాయకులు డిమాండ్ చేశారు.

### కారేపల్లిలో భారీ ఊరేగింపు

భద్రాచలం నుండి ఫారెస్టు బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ మృతదేహం కారేపల్లి తీసుకవస్తున్న సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. యువకులు అధిక సంఖ్య పాల్గొని తోటి మిత్రునికి నివాళ్లు అర్పించారు. భ్రదాచలం అసుప్రతిలో నవీన్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సందర్శించి నివాళ్లు అర్పించారు. మృత దేహాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పగడాల మంజుల,



బానోత్ రాంమ్మూర్తి, మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు, అడ్డగోడ ఐలయ్య, పెద్దబోయిన ఉమాశంకర్, గుడిపుడి తిరుమలరావు, గుగులోత్ భీముడు, కడియాల సుధాకర్, ఈసాల నాగేశ్వరరావు, వాంకుడోత్ గోపాల్, సర్పంచ్ లు భూక్య రంజిత్, బానోత్ హీరాలాల్, మేదరి వీరప్రతాప్, పొడుగు పెంటయ్య, ఈసాల వెంకటేశ్వర్లు, కల్తి భద్రయ్య, దారావత్ మంగీలాల్, బీఆర్ఎస్ నాయకులు ముత్యాల సత్యనారాయణ, అడపా పుల్లారావు, లాకావత్ లక్ష్మన్, వాంకుడోత్ జగన్, సీపీఎం నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర తదితరులు ఉన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ఎవరి కోసం వీరి ఆందోళనలు ?

**పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో ఢిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది.**

ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్‌సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్‌సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్‌సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ



చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో తదుపరి దశకు సన్నద్ధం కావాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా.. అక్టోబర్ 19న తుది జాబితా

### నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత ధృవపత్రాలను సమర్పించాలి

### ఎస్ఐఆర్‌పై కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం ఏర్పాటు

**అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామని, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహకరించిన ప్రజలు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎస్.ఐ.ఆర్. తదుపరి దశకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మీడియాతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్, అనామలీస్, ఫారాలు తిరిగి సమర్పించని ఓటర్ల వివరాలు, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, అవసరమైన ధృవపత్రాల సమర్పణ, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను రెండు పర్యాయాలు పొడిగించిందని తెలిపారు. ప్రస్తుతం తొలి దశ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి దశకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

**10 లక్షల 85 వేల 927 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్**

ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 ఎన్యూమరేషన్ ఫారాలు (87.31 శాతం) మేర డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. సేకరించిన ఫారాల్లో 43,131 మంది మ్యాపింగ్ చేయబడలేదని, వీరికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ



చేస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవపత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా తగిన ధృవపత్రాన్ని సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ధృవపత్రాలు అందుబాటులో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, వారికి అవసరమైన ధృవ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఎస్.ఐ.ఆర్. డేటాలో 1,32,736 అనామలీస్ గుర్తింపు**

జిల్లాలో 1,32,736 అనామలీస్ గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇది మొత్తం ఫారాల్లో 10.67 శాతం అని చెప్పారు. పేర్ల స్పెల్లింగ్‌లో తేడాలు, తల్లిదండ్రులు--పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉండటం తదితర కారణాలతో అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. వీటిని కేవలం డేటాలోని లోపాలుగా పరిగణించకుండా, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం అవసరమైన సవరణలు చేపడతామనితెలిపారు.

**1,57,854 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు**

జిల్లాలో 1,57,854 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించలేదని కలెక్టర్ తెలిపారు. వీరిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించామని చెప్పారు. క్షేత్రస్థాయి విచారణలో 33,380 మంది మరణించిన ఓటర్లు, 11,004 మంది డబుల్ ఓటర్లు, సుమారు 1,01,000 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మరో సుమారు 11 వేల మంది వివిధ కారణాల వల్ల ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించలేకపోయారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన లో తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

**ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం**

ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు మరో అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇతర ప్రాంతంలో తనకు ఓటు హక్కు లేదని ప్రకటిస్తూ అవసరమైన డిక్లరేషన్‌తో పాటు సంబంధిత వివరాలు, ధృవపత్రాలను సమర్పించవచ్చని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులైన పౌరులు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పుట్టిన తేదీకి అనుగుణంగా ఎన్నికల సంఘం సూచించిన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వేడుకలు :

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు,13)**

మరికల్ మండల కేంద్రంలో బుధవారం ఇంద్ర గాంధీ చౌరస్తాలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు ఎర్ర సత్యం వర్ధంతి వేడుకలు మరికల్ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు కాని గంటి నారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా మాట్లాడుతూ ఎర్ర సత్యం చేసిన సేవలను కొనియాడారు.



బడుగు బలహీన వర్గాల కొరకు ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్య మోహన్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ జి. జగదీష్, జోగు రామస్వామి, పెంట మీది నరసింహులు, కస్పే శ్రీనివాసులు, వార్డు సభ్యులు సురిటి చంద్రశేఖర్, పెంట మీది రాఘవేందర్, రామకృష్ణారెడ్డి ,పి. శ్రీనివాసులు, కురుమన్న, ట్రైసన్ రఘు, పి .రామకృష్ణ, కే. హరీష్, కే. కృష్ణయ్య, పెంటమిది సత్యనారాయణ, ఆంజనేయులు, మంగలి రఘు, తదితర యువకులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయండి

### టి జే ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్

### అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ కు టి జే ఎఫ్ వినతి

**అక్షర కలం/ ఉమ్మడి ఖమ్మం బ్యూరో :**

గతంలో మాదిరిగా ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ యధావిధిగా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెద్ద, మీడియం, చిన్న పత్రికలు, చానళ్లు,



ఇండిపెండెంట్ జర్నలిస్టులకు జిల్లా కేంద్రాలలో, మున్సిపాలిటీ కేంద్రాలలో ఉన్న రిపోర్టర్లకు కార్డులు తగ్గించటం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం నియోజకవర్గాల ఇన్చార్జిలకు జిల్లా కార్డులు ఇవ్వాలని, వారికి రాష్ట్రస్థాయి బస్సు పాసుల సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంప్యానల్ ఉన్న కేబుల్ ఛానల్ కు వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వివరించారు. పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డి పి ఆర్ ఓ గౌస్ ను ఆదేశించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జె టిజెఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్న బోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ , యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందుల ఉపేందర్, హరీష్, మందటి రమణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ రామి శెట్టి విజేత, అడపాల నాగేందర్, శాస్త్రి, ఫోటోగ్రాఫర్ రాజు, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, అమరవరపు కోటేశ్వరరావు, ఎస్వీ రెడ్డి, రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, గోవిందు, రోసి రెడ్డి,ఇసంపల్లి వెంకటేశ్వర్లు, మాధవి, కిరణ్మయి, పెంటి వెంకటేశ్వర్లు, బి యాదగిరి,మోహన్, సాయి, గౌరీ శంకర్, పాశం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తాలిపేరు ప్రాజెక్టును, ఏకలవ్య పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అంకిత్.

**అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:–**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలోని తాలిపేరు ప్రాజెక్టును, ఏకలవ్య మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఏకలవ్య పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ విద్యార్థుల బోధన సదుపాయాల విషయం, పాఠశాల నడుస్తున్న తీరును పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, ఆ రోజు తరగతులకు హాజరైన విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం




విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహన, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించి, కొంతమంది విద్యార్థులతో పుస్తకాలు చదివించి వారి చదివే సామర్థ్యాన్ని స్వయంగా తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు, వసతుల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలలోని కిచెన్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత, వంట చేసే విధానం, ఉపయోగిస్తున్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం ఎలా ఉందనే విషయాలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలోని హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న మందులు, మందుల నిల్వ, విద్యార్థులకు అందిస్తున్న వైద్య సేవలు, నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలను ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా, ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను ఏ విధంగా గుర్తించి చికిత్స అందిస్తున్నారనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్‌తో పాటు పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి వివరాలను సరిచూశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చర్ల లోని తాలిపేరు ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక


## ఆట





# ఐపీఎల్ ట్రేడింగ్‌లో హార్దిక్ పాండ్యా హవా..


ఐపీఎల్ ట్రేడింగ్ విండోలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ నుంచి పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు కూడా ఆసక్తిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు పెద్దగా చర్చలు జరగలేదట. గుజరాత్ టైటాన్స్ జట్టును మొదటి సీజన్లోనే విజేతగా, రెండో సీజన్లో రన్నరప్‌గా నిలబెట్టిన హార్దిక్ పాండ్యా, ముంబై ఇండియన్స్‌లో మాత్రం స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. మూడు సీజన్లలో ఒకేసారి ప్లే ఆఫ్స్ చేరాడు. కానీ ఫాస్ట్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్‌గా, టీమ్‌కు మంచి బ్యాలెన్స్ తెచ్చే లీడర్‌గా ఐపీఎల్‌లో అతడికి మంచి డిమాండ్ ఉంది. అందుకే ఫ్రాంచైజీలు హార్దిక్ కోసం పోటీ పడుతున్నాయి. ముంబై ఒకవేళ ట్రేడింగ్ చేసే యోచనలో ఉంటే, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన అక్షర్ పటేల్‌తో స్వాప్ చేసుకోవచ్చనే చర్చ సాగుతోంది. అక్షర్ రాకతో ముంబై స్పిన్ విభాగం బలపడటమే కాకుండా విదేశీ ఆల్‌రౌండర్లపై ఆధారపడటం తగ్గుతుంది. అయితే, తమ స్టార్ ఆల్‌రౌండర్‌కు ప్రతిఫలంగా అగ్రశ్రేణి భారతీయ బ్యాటర్ లేదా బౌలర్‌ను మాత్రమే కోరాలని ముంబై భావిస్తోంది. కేకేఆర్ ఫ్రాంచైజీ కామెరూన్ గ్రీన్‌ను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. కానీ రాబోయే యాషెస్ సిరీస్ దృష్ట్యా అతని లభ్యతపై అనుమానాలు ఉండటంతో ముంబై సుముఖంగా లేదు. అటు సీఎస్కే విషయానికొస్తే, నూతన ఓవర్సీస్ కోచ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే హార్దిక్ పాండ్యా ట్రేడ్‌పై నిర్ణయం తీసుకుంటామని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ఐపీఎల్‌లో ఒక ఆనవాయితీ ఉంది, అదేంటంటే -- ట్రేడింగ్ ద్వారా ప్రత్యర్థి జట్లను బలంగా మార్చకూడదు. పాండ్యా ఫామ్ అంత గొప్పగా ఏమీ లేనప్పటికీ, అతడు వేరే జట్టులోకి వెళ్తే ఆ జట్టు అత్యంత ప్రమాదకరంగా మారుతుందని ముంబై ఇండియన్స్‌కు తెలుసు. అందుకే వేరే జట్టును బలోపేతం చేసే కంటే, తమ జట్టుకు గరిష్ట ప్రయోజనం చేకూరే ప్రతిపాదన వస్తేనే పాండ్యాను వదులుకోవాలని ముంబై భావిస్తోంది. ప్రస్తుతం బెంగళూరులోని సీఓఈలో ఫిట్‌నెస్ సాధిస్తున్న హార్దిక్, తన భవిష్యత్తుపై ముంబై నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాడు!




# రిషభ్ పంత్ విలక్షణ ప్రవర్తన..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మైదానంలో ఉంటే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదు. తన బ్యాటింగ్‌తోనే కాకుండా చేష్టలతోనూ అతడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తాజాగా శ్రీలంక లెవెన్‌తో జరిగిన వార్మప్ మ్యాచులోనూ అదే జరిగింది. కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో పంత్ తన బ్యాటింగ్ శైలితోనే కాక, ఫుట్‌బాల్ నైపుణ్యాలతోనూ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో త్వరగానే పెవిలియన్ చేరిన పంత్, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టాడు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలో అత్యంత జాగ్రత్తగా ఆడాడు. ఎంతలా అంటే.. మొదటి 21 బంతుల వరకు పరుగుల ఖాతానే తెరవలేదు. ధాటిగా ఆడే పంత్ ఇలా సుదీర్ఘంగా డిఫెన్స్ ఆడటం చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఆశ్చర్యపోయాడు. అయితే క్రీజులో కుదురుకున్నాక పంత్ తన అసలు రూపాన్ని బయటకు తీశాడు. శ్రీలంక బౌలర్లు కేశవ నువంత, దిలుమ్ సుదీరల బౌలింగ్‌లో విరుచుకుపడుతూ మూడు భారీ సిక్సర్లతో చెలరేగిపోయాడు. పంత్ సిక్సర్ల హోరును అడ్డుకోవడానికి స్పిన్నర్ సుదీర వైడ్ లెగ్ స్టంప్ దిశగా బంతులు వేయడం ప్రారంభించాడు. అయితే ఆ బంతులను వదిలేయకుండా, పంత్ తన కాళ్లతో ఫుట్‌బాల్ ప్లేయర్‌లా బంతిని వెనక్కి తన్నుతూ విన్యాసాలు చేశాడు. పంత్ చేసిన ఈ క్రేజీ పని చూసి మైదానంలోని ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా నవ్వేశారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి గాలే టెస్టుకు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లు శ్రమించినప్పటికీ, రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు మెరుపులు మెరిపించారు. ఆగస్టు 15న గాలే వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య తొలి టెస్టు జరగనుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరగనుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



## సినిమా
CINEMA




# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల

నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.




# మహేశ్ బాబు ఎఐ వీడియో షేర్ చేసి వంగా

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.

# హుషారు పిట్టలు ట్రైలర్ విడుదల

అన్షు, వాసవి గణెళిశన్ జంటగా రూపొందిన చిత్రం 'హుషార్ పిట్టలు'. బిక్షు దర్శకుడు. వెంకట్ యాదవ్ నిర్మాత. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు 'ఏ ప్రేమ కావాలి.. కన్నవాళ్లదా.. ప్రేమించిన వాళ్లదా..' ఆలోచింపచేస్తున్నాయి.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ అధ్యక్షులుగా సుక్క స్వామి

అక్షర కలం, చౌటుప్పల్



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా సుక్క స్వామిని,గౌరవ అధ్యక్షులు తోర్పునూరి సాయిలు గౌడ్,చింతల గణేష్,భారత మధు,వరగంటి వెంకటేష్,నందగిరి పరమేష్,జక్క చలమంద రెడ్డి,బోడిగే ప్రభాకర్ ఉపాధ్యక్షులు గా ఎర్ర శివ,వరికుప్పల మహేష్,ప్రధాన కార్యదర్శి వనం రుషి,కోశాధికారి రోషణ గారి రాఘవేంద్ర గౌడ్,సహాయ కార్యదర్శి పల్లెర్ల సుజిక్,ప్రచార కార్యదర్శి పగడాల శంకర్,కార్యవర్గ సభ్యులుగా మలిగె రవి,పగిళ్ల మహేష్,డాకోజీ వెంకట శివకుమార్,జాజుల రామకృష్ణ,పెడకంటి నాగేంద్ర, లను ఎన్నుకన్నారు.

# దేశాభివృద్ధికి ప్రతి పౌరుడూ పాటుపడాలి

## -- బీజేపీ నేత మాయ దశరథ




అక్షరకలం బీబీనగర్

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర బుధవారం ఘనంగా జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు భువనగిరి సదానందం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాణత్యాగాలు చేసి దేశ స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయులను స్మరించుకున్నారు. 'ఒకే దేశం--ఒకే జెండా' నినాదంతో పోరాడిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలను, ప్రధాని నరేంద్ర మోదీ ఆర్టికల్ 370 రద్దు ద్వారా నిజం చేశారని కొనియాడారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారత్ అంతటా ఒకే జెండా ఎగురుతోందని గుర్తుచేశారు. దేశ సంస్కృతిని కాపాడుతూ, జాతీయ జెండాను గౌరవిస్తూ ఆగస్టు 15న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోయపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు పసులాది రామచందర్, ఇంజమూరి ప్రభాకర్, సురకంటి జంగారెడ్డి, ముస్కే సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

అక్షరకలం బీబీనగర్



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని వారి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 15, 16 తేదీల్లో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ?ఈ కార్యక్రమంలో జైనపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మైలారం మహేష్, వార్డు సభ్యులు బెజ్జంకి అమరేందర్ రెడ్డి, ఉగ్గి నరసింహ కురుమ, పార్టీ సీనియర్ నాయకులు ఆర్మల రాజు ముదిరాజ్, నక్కర్తి మహేష్ ముదిరాజ్, పుట్ట రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ డైరెక్టర్ దారుణ హత్య

## --రక్తపు మడుగులో నాగార్జున పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రూపారెడ్డి

## --భర్త హైదరాబాద్ వెళ్లిన సమయంలో అర్ధరాత్రి ఘటన

## --కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అక్షరకలం దేవరకొండ

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో దారుణం చోటుచేసుకుంది. స్థానిక నాగార్జున పబ్లిక్ స్కూల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రూపారెడ్డి (జెబి కాలనీ నివాసి) అర్ధరాత్రి నివాసంలో దారుణంగా హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూపారెడ్డి భర్త పనుల నిమిత్తం నిన్న హైదరాబాద్ వెళ్లారు. ఇంట్లో ఆమె ఒక్కతే నిద్రిస్తున్న సమయంలో అగంతకులు చొరబడి ఈ హత్యకు పాల్పడ్డారు. తెల్లవార్జామున భర్త ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానం వచ్చి అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి ఫోన్ చేసి చూడమని కోరగా, డోర్ తెరిచి చూసేసరికి రూపారెడ్డి రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న కొండమల్లేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు.ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.పాత కక్షలు, వ్యాపార లావాదేవీలు లేదా దొంగతనం కోసం వచ్చి హత్య చేశారా అనే పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నుంచి చేరుకున్న భర్త ఇచ్చిన ఫిర్యాదు, వాంగ్మూలం ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు వేగవంతం చేశారు.



# డిండి సమగ్ర అభివృద్ధే లక్ష్యం

## ---అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

## -- ఎమ్మెల్యే బాలు నాయక్

అక్షరకలం దేవరకొండ





డిండి మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో వివిధ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ భూ పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టాలు పొందిన రైతులు రైతు భరోసా, రైతు బీమా దరఖాస్తులతో పాటు ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెంటనే పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డిండి ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కింద జలసిరి పనులు, గొర్రెలు-బర్ల షెడ్లు, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. అర్హులందరికీ ఇళ్లు, పెన్షన్లు మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. సర్వేలో గుర్తించిన 45 గుడిసెల స్థానంలో కొత్త ఇళ్లు మంజూరు చేస్తాం. నిర్మాణాలు 750 చదరపు అడుగుల స్లాబ్ ఏరియా నిబంధనకు లోబడి ఉండాలి.వితంతువులు, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు సహా అన్ని వర్గాల అర్హులకు పెన్షన్లు మంజూరయ్యేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. నల్లగొండ నుంచి డిండి వరకు డబుల్ రోడ్డు పనులను 'హామ్' పద్ధతిలో మొదటి విడతలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించాలని, పైప్‌లైన్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలకు స్వయం ఉపాధి కల్పన, పశు సంవర్ధక శాఖ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.ఈ సమావేశంలో డీఎల్పీఓ శంకర్ నాయక్, ఎంపీడీఓ, తహసీల్దార్, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# టిప్పర్లు, డంపర్లకు 'ఆటోమేటిక్' రక్షణ !

## కవర్ మూస్తేనే వాహనం ముందుకు.. క్యాబిన్‌లో మోగనున్న అలర్ట్

## 2027 ఏప్రిల్ 1 నుంచి అమలుకు కేంద్రం శ్రీకారం

## రహదారి భద్రత, కాలుష్య నియంత్రణే లక్ష్యం

## డిటిసి వాణి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



రహదారులపై ప్రయాణించే వాహనదారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, వాయు కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రహదారులపై నిరంతరం తిరిగే టిప్పర్లు, డంపర్లకు 'ఆటోమేటిక్ లోడ్ కవర్ల'ను తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నూతన విధానం 2027 ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రానుంది.

**రోడ్డుపై పడితే ప్రయాణం ప్రమాదకరం..**

సాధారణంగా టిప్పర్లు, డంపర్లలో ఇసుక, మట్టి, కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని కప్పకుండా రవాణా చేయడం వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనం వేగంగా వెళ్లేటప్పుడు గాలికి దుమ్ము రేగడం, చిన్న చిన్న రాళ్లు ఎగిరి వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడటం వల్ల ప్రయాణికులు నియంత్రణ కోల్పోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా రహదారులపై మట్టి, రాళ్లు జారిపడటం వల్ల టైర్లు స్కిడ్ అయ్యే అవకాశాలు పెరగడమే కాకుండా వాయు కాలుష్యం తీవ్రమవుతోంది.

**సెన్సార్ సాంకేతికతతో సురక్షిత ప్రయాణం..**

నూతనంగా ప్రవేశపెడుతున్న ఆటోమేటిక్ లోడ్ కవర్ విధానం పూర్తిగా సాంకేతికతతో పనిచేస్తుంది. వాహనం కదులుతున్న సమయమంతా లోడ్ పూర్తిగా కప్పి ఉంచేలా ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఒకవేళ లోడ్ కవర్ తెరిచి ఉంటే, డ్రైవర్ క్యాబిన్‌లో వెంటనే అలర్ట్ సౌండ్ మోగుతుంది. డ్రైవర్ కవర్ పూర్తిగా మూసివేసిన తర్వాతే వాహనాన్ని ముందుకు తీసుకెళ్లేలా ఈ సురక్షిత సాంకేతికత తోడ్పడుతుంది.

**ముఖ్య ప్రయోజనాలు..**

రహదారులపై ఇసుక, మట్టి, చెత్త పడకుండా నిరోధించవచ్చు.ద్విచక్ర వాహనదారులకు ప్రమాద భయం తప్పి, ప్రయాణ భద్రత పెరుగుతుంది.
?వాహనాల నుంచి రాళ్లు జారిపడి జరిగే ఘోర ప్రమాదాలకు చెక్ పడుతుంది.గాలిలో దుమ్ము రేగకుండా వాయు కాలుష్యం అదుపులోకి వస్తుంది. ?పర్యావరణ పరిరక్షణతో పాటు రహదారుల పరిశుభ్రత సాధ్యమవుతుంది.

**సమిష్టి బాధ్యతతోనే ప్రమాదాల నివారణ..(డిటిసి వాణి)**

రహదారి భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, వాహన యజమానులు, డ్రైవర్లు, రవాణాదారులు సమిష్టిగా కృషి చేయాలని నల్గొండ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి పేర్కొన్నారు. 2027 నాటికి ఈ నిబంధన పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్న నేపథ్యంలో, టిప్పర్లు, డంపర్ల యజమానులు ఇప్పటి నుంచే తమ వాహనాల్లో సురక్షిత కవరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు పాటించి రహదారి భద్రతకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# అమ్మా.. ఆకలేస్తోంది

## పాలు పట్టాల్సిన చేతులతో పాశం పోసుకుంది

## తమ్ముడొచ్చాడన్న ఆనందం ఎనిమిది రోజులకే ఆవిరి

## నల్గొండ ఆసుపత్రి నిర్లక్ష్యపు నీడలో కన్నుమూసిన బాలింత మమత

## మార్చురీ వద్ద ఉరివేసుకున్న చీకటిమామిడి వాసి

## సిబ్బంది నిర్లక్ష్యం.. పనిచేయని సీసీ కెమెరాలపై బంధువుల తీవ్ర ఆగ్రహం

## ఏ-వన్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసు.. రంగంలోకి ఉన్నతాధికారుల బృందం

## నేడు హెల్త్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టియానా రాక !

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) పాలనా రాహిత్యానికి, రక్షణ లేమికి మరో బాలింత బలైంది. పచ్చని పసిపాపకు జన్మనిచ్చి, ప్రాణ రక్షణ కల్పించాల్సిన మెటర్నిటీ వార్డు నుంచే ఓ తల్లి నడుచుకుంటూ వెళ్లి శవమై తేలింది. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన గండు మమత (27) అనే బాలింత బుధవారం తెల్లవారుజామున ఆస్పత్రి ఆవరణలోని మార్చురీ గది వద్ద ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.

**ఎనిమిది రోజుల ముచ్చటే మిగిలింది..**

గ్రామంలో వ్యవసాయం చేసుకునే గండు రమేష్, మమత దంపతులకు ఇదివరకే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఎనిమిది రోజుల క్రితం నల్లగొండ జీజీహెచ్‌లో నాలుగో కాన్పుగా మమత మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇంట పురిటి వెలుగులు నిండాయనే ఆనందం ఆ కుటుంబంలో ఎంతోసేపు నిలవలేదు. బుధవారం తెల్లవారుజామున మెటర్నిటీ వార్డు నుంచి ఒంటరిగా బయటకు వచ్చిన మమత, మార్చురీ సమీపంలో బలవన్మరణానికి ఒడిగట్టింది. రాత్రంతా విధుల్లో ఉండాల్సిన సిబ్బంది కంటిముందే బాలింత బయటకు వెళ్తున్నా పట్టించుకోకపోవడం, ఉదయం వరకు మృతదేహాన్ని కూడా గుర్తించకపోవడం ఆస్పత్రి నిర్వహణ లోపానికి అద్దం పడుతోంది.

**-నిర్లక్ష్యానికి నెలవుగా మారిన జీజీహెచ్..**

ఘటనపై సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు ఆస్పత్రి ఆవరణలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మెటర్నిటీ వార్డు నుంచి మమత ఏ సమయంలో బయటకు వెళ్లిందో తెలుసుకుందామంటే ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వారి అనుమానాలకు బలం చేకూర్చింది. "అసలు ఆస్పత్రిలో భద్రత ఉందా? వైద్యం సరిగా అందక పోవడం వల్లే ఆందోళనతో ఈ దారుణానికి ఒడిగట్టిందా?" అని మృతురాలి కుటుంబీకులు ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అధికారుల హడావుడి.. నోటీసుల జారీ...**

విషయం దావానలంలా వ్యాపించడంతో డిఎమ్ఈ డాక్టర్ వాణి, నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, టూ టౌన్ ఎస్ఐ సైదా బాబు హుటాహుటిన ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. భద్రతా వ్యవహారాల్లో ఘోరంగా విఫలమైందంటూ 'ఏ-వన్' సెక్యూరిటీ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఈ ఘోరంపై సమగ్ర విచారణ జరిపేందుకు హెల్త్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టియనా స్వయంగా ఆస్పత్రికి నేడు రానున్నట్లు సమాచారం.

**పర్యవేక్షణ శూన్యం.. సెలవుల్లోనే అధికారి...**

జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా పడకేసిందనడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం. గత జూలై మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించిన రెగ్యులర్ సూపరింటెండెంట్ వచ్చిన నెల రోజుల్లో ఏకంగా 28 రోజుల పాటు సుదీర్ఘ సెలవుపై వెళ్లడం గమనార్హం. ఇన్చార్జిల పాలనలో పర్యవేక్షణ లోపించి, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్వయంగా ఆస్పత్రి సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. కాగా, మృతురాలి తల్లి ఎట్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు టూ టౌన్ ఎస్ఐ సైదా బాబు వెల్లడించారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఎస్సీ, ఎస్టీల హక్కుల రక్షణలో 'రాజీ' లేదు

## సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లిస్తే కఠిన చర్యలు

## నల్గొండ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరిక

## ఆర్ఓఆర్, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

## ఉద్యోగాలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు తప్పనిసరి

## దాడుల కేసుల్లో బాధితులకు వెంటనే పరిహారం

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి అభివృద్ధి కి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పకడ్బందీగా అమలు కావాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.బుధవారం ఆయన కమిషన్ సభ్యులతో కలిసి నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి ల కై వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కాగా వినియోగించాలని,దారి మళ్లించవద్దని, ఒకవేళ దారి మళ్ళి ఇస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాలలో చేపట్టేందుకు మంజూరైన పనులు ఇతర పనులకు మళ్లించకూడదన్నారు. ఎక్కడైనా సబ్ ప్లాన్ నిధులు మిగిలిపోతే తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రోడ్లు, ఇతర పనులు చేపట్టాలన్నారు. ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు తప్పనిసరిగా ఆర్ఓఆర్ అమలు చేయాలని, ఈ విషయంలో అన్యాయం జరిగితే కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు. ఎంపీ నిధులు నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్ డి ఎఫ్ నిధులను రిజర్వేషన్ ప్రకారం కేటించాలన్నారు. మిర్యాలగూడ డివిజన్లో శూన్యపహాడ్, గణేష్ పహాడ్ రోడ్డు వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల పై దాడులకు సంబంధించి కోర్టు కేసులు జాప్యం లేకుండా పరిష్కరించాలని, శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీలే పనిచేస్తున్నందున పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై తక్షణమే విచారణ నిర్వహించి కమిషన్ కు నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. చండూరు మండలం అంగడిపేటకు చెందిన ఎస్సీ మహిళ మేకల బుచ్చమ్మ ఇంటి వివాదం కేసును విచారించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

### త్వరలోనే పరిహారం...

అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ దాడుల కేసుల్లో బాధితులకు అందించాల్సిన కోటి 89 లక్షల రూపాయల పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా తెప్పించేందుకు ప్రయత్నిస్తామని, అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న వారికి, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు తెప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రితో నిర్వహించనున్న హై పవర్ కమిటీలో వీటన్నిటిపై సమీక్షించి నిధులు మంజూరు చేయమని కోరనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని గుడితాండ పునరావాస కేంద్రానికి సంబంధించి 130 మందికి పరిహారం రాని విషయంలో సమగ్ర విచారణ నిర్వహించి వారికి న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ ను ఆదేశించారు. నల్గొండ జిల్లా కేంద్రం బై పాస్ వద్ద డాక్టర్ బి అర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను రోడ్డు నుండి తొలగించకుండా కమిటీ వేసి విచారణ నిర్వహించాలని నిర్ణయం తీసుకోవాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు,తెగల వారిపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచార కేసుల్లో ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్న అడ్వకేట్ దర్శనం నరసింహ కు గన్ మెన్ ను పునరుద్ధరించాలని జిల్లా ఎస్పీని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాలలో రిజర్వేషన్ పాటించాలని, ప్రమోషన్లలో ఎవరికి అన్యాయం జరగకుండా చూడాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వెయ్యి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారని ,మరో వెయ్యి ఇండ్లు ఇస్తామని తెలియజేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు కేటాయించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరనున్నట్లు ఆయన వెల్లడించారు.

### విగ్రహాలను తొలగించొద్దు..

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ల పై దాడుల కేసుల పరిష్కారం, డ్రగ్స్ అరికట్టడంలో పోలీసు, రెవెన్యూ శాఖలు






చేస్తున్న కృషిని ప్రశంసించారు. నల్గొండ బైపాస్ లో ఉన్న మహాత్ముల విగ్రహాలను అక్కడినుండి కదిలించవద్దని, ఎస్సీ, ఎస్టీల పై దాడుల కేసులకు సంబంధించిన అడ్వకేట్ దర్శన్ కు గన్మెన్ రక్షణ కల్పించాలని, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అవుట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకానికి సంబంధించిన అంశంపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ కేసులో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చేయాలని, శూన్య పహాడ్, గణేష్ పహాడ్ రోడ్డుకు సంబంధించిన సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహక మొత్తాన్ని ఇప్పించడంలో చొరవ తీసుకోవాలని కోరారు. మరో సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేకూర్చేందుకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పర్యటిస్తున్నదని, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కి ఇతర రాష్ట్రాలలో సైతం ఎస్సీ, ఎస్టీలపై అధ్యయనం చేయడం జరిగిందని, నల్గొండ జిల్లాలో గతంలో కంటే కేసుల పరిష్కారం ఎంతో మెరుగ్గా ఉందని, ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో అగ్రవర్ణాల ఆధిపత్యానికి అరికట్టే చర్యలు తీసుకోవాలని, గుడితాండా ఆర్ అండ్ ఆర్ లో తండ్రులకు నష్టపరిహారం రాగా, కొడుకులకు ప్యాకేజీ రాలేదని, ఈ విషయంపై ప్రత్యేకంగా విచారణ నిర్వహించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

### పకడ్బందీగా చట్టం అమలు...

సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి పై దాడులకు సంబంధించి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి రెండుసార్లు సమావేశాలు నిర్వహించామని, రెవిన్యూ, పోలీస్ తరఫున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎస్సీ, ఎస్టీల కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ప్రతి నెల క్రమం తప్పకుండా పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీల ప్రజల హక్కులు కాపాడడంలో వారి ఇబ్బందులను తీర్చేందుకు శాయ శక్తుల కృషి చేస్తున్నామని, డివిజన్, మండల స్థాయిలలో కూడా అధికారులు ఎస్సీ, ఎస్టీ ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

### సంవత్సరానికి 100 కేసులు...

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా నల్గొండ జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుతోపాటు, నిరంతర సమీక్షలు, దాడులలో బాధితులకు నష్టపరిహారం ఇప్పించడం, క్రమం తప్పకుండా పౌర హక్కుల దినం నిర్వహించడం చేస్తున్నామని, ప్రతి సంవత్సరం జిల్లాలో 90 నుండి 100 వరకు ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు నమోదు అవుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 54 కేసులు విచారణలో ఉండగా, ఇప్పటివరకు 6 కేసుల్లో కోర్టుల ద్వారా శిక్షణ కూడా విధించడం జరిగిందని వెల్లడించారు.

### బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయండి...

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సంకు ధనలక్ష్మి, బెజ్జం సైదులు, మరో సభ్యులు అనిత, భీమనపల్లి సైదులు, భాస్కర్ తదితరులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కింద సబ్ ప్లాన్ కింద లోన్లు ఇప్పించాలని, బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ లో ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ఉద్యోగులను నియమించాలని, ఎస్సీలు కేసులు పెట్టినప్పుడు త్వరిత గతిన పరిష్కరించాలని, ఆర్ ఓ ఆర్ తప్పనిసరిగా పాటించేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీ వాడల్లో టాయిలెట్స్ నిర్మించాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఎస్సి వాడల్లో సిసి రోడ్లు, డ్రైన్లు వేయించాలని, ఎస్సీ కాలనీలలో సారా అరికట్టాలని, గ్రామాలలో చట్టాలపై అవగాహన కల్పించాలని, అంగడిపేట మేకల బుచ్చమ్మ కేసును త్వరితగతిన పరిష్కరించాలని, అలాగే కేసులను పరిష్కరించాలని కోరారు. పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ సి,ఎస్ టి ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కే. లక్ష్మీనారాయణ, కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమకరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,సాంఘిక సంక్షేమ శాఖ డిడి శశికళ, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, డి.ఎఫ్.ఓ రాజశేఖర్, డిఆర్ఓ దశరథ్, ఆర్డీవోలు, డిఎస్పీలు, పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమీక్ష కోసం జిల్లా చేరుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సభ్యులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పుష్పగుచ్చలను అందజేసి ఘన స్వాగతం పలికారు.

# మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు



అక్షర కలం నల్లగొండ

నూతనంగా జిల్లాకు విచ్చేసిన నల్గొండ జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుకీర్తి ని వారి కార్యాలయంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడిగం నాగయ్య ముదిరాజ్ అధ్యక్షతన జిల్లా ముదిరాజ్ మహాసభ నాయకులు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో డి ఎఫ్ సి ఎస్ చైర్మన్ కనుకు వెంకటనారాయణముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు వెలుగు రవి ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ .రాష్ట్ర కార్యదర్శి బోళ్ల వెంకట్ ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు రాశిక హనుమయ్యముదిరాజ్ వెలుగు యాదయ్య ముదిరాజ్ జిల్లా డైరెక్టర్ లక్ష్మమ్మ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోసంగి వెంకటేశ్వర్లు ముదిరాజ పిట్టల నర్సింహా ముదిరాజ్,పల్లె నరేష్ కొచ్చెర్ల కోటేష్, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో స్కూల్ కరస్పాండెంట్ మృతి



అక్షరకలం దేవరకొండ:

కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ కళ్లూరూప రెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. దేవరకొండ ఆసుపత్రిలో ఆమె భౌతికకాయానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నివాళులర్పించి, నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొండమల్లేపల్లి సీఐని ఆదేశించారు. నేతలు జమున మాధవరెడ్డి, సిరాజ్ ఖాన్, వేమన్ రెడ్డి పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించిన అదనపు ప్రేమ్ కరణ్ రెడ్డి



అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్. ప్రేమ్ కరణ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనులు, మౌలిక వసతులు, పెండింగ్లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు పంపిణీ ఈ కార్యక్రమం చేపడతామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో మిగిలిన పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ లోకిలాల్, హౌసింగ్ డీఈ అబ్దుల్ వజీద్, ఏఈ ప్రీతి, మున్సిపల్ చైర్పర్సన్ పందిరి గీత రమేష్, కమిషనర్ గురులింగం, వైస్ చైర్పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మీ సైదులు, మున్సిపల్ కౌన్సిలర్లు, హౌసింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెలిమినేడు కంపెనీల హెచ్ఆర్లను నిలదీసిన జెన్జీ యువత

అక్షరకలం చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక కంపెనీల హెచ్ఆర్లతో జెన్జీ ప్రతినిధులు సమావేశమయ్యారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యలు, స్థానికులకు ఉద్యోగాల కల్పన, సీఎస్ఆర్ నిధుల కేటాయింపు, అక్రమ కేసుల ఉపసంహరణపై కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. ?లేవనెత్తిన అంశాలపై ఆగస్టు 17 నాటికి సంతృప్తికరమైన స్పందన రాకపోతే తదుపరి ఉద్యమ



కార్యాచరణ ప్రకటిస్తామని యువత డెడ్లైన్ విధించింది. ఈ సమావేశంలో సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, జెన్జీ వ్యవస్థాపకులు పోలగోని శివప్రసాద్, బిల్లపాటి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అద్దె వాహనానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్, ఆగస్టు12 ( అక్షర కలం );

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాధికారి, ఐసీడీఎస్, హుజరాబాద్ ప్రాజెక్టు కార్యాలయానికి అద్దెప్రాధిపదికన వాహనం సమకూర్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు వాహనం, డ్రైవర్ కు సంబంధించిన అన్నిప్రతులు జత చేసి సీల్డ్ కవర్లో దరఖాస్తులు ఈనెల 15 సాయంత్రం 5 గంటలలోపు హుజూరాబాద్ కేసీ క్యాంపులో గల సిడిపిఓ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

# జీఆర్ఎంబి ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం

### ఎజెండాలో గత అంశాలను తొలగించాలని డిమాండ్

హైదరాబాద్,

గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు అజెండాపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ నెల 18వ తేదీన జీఆర్ఎంబీ 18వ సమావేశం జరగనుంది. తెలంగాణ ప్రాజెక్టులపై మూడు అంశాలు అజెండాలో పెట్టడంపై అభ్యంతరం తెలిపింది. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని తొలగించాలని కోరింది. తెలంగాణ ప్రాజెక్టుల టిఎసి అనుమతుల వివరాల అంశం కూడా వద్దని తెలిపింది. సిడబ్ల్యూసి తదితర సంస్థలు ఇచ్చిన అనుమతుల సమీక్ష అంశంపైనా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాలపై ఇప్పటికే జీఆర్ఎంబీలో విస్తృతంగా చర్చించామని వెల్లడించింది. గతంలో ఏపీ అభ్యంతరాలను సిడబ్ల్యూసి పరిశీలించి తిరస్కరించిందని తెలంగాణ సర్కార్ వాదించింది. సిడబ్ల్యూసి అవార్డు, మార్గదర్శకాల ప్రకారమే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. మూడు అంశాలను అజెండా నుంచి డ్రాప్ చేయాలని జీఆర్ఎంబీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సవరించిన అజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇదిలావుంటే ఈ ఎజెండాపై వారం క్రితమే మాజీమంత్రి హరీష్ రావు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అజెండా అంశాలను ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు.

# ఆగస్టు 15 కొత్త పెన్షన్ విధానంలో వృద్ధులు, బీడీ కార్మికులను చేర్చాలి

## గ్రామ బీడీ కార్మికులకు మద్దతు గా నిలిచి అధికారులకు వినతిపత్రం అందజేసిన గంగాపూర్ సర్పంచ్

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 12:**

ఈ నెల ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న పెన్షన్ పథకంలో వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల పెన్షన్ విధానాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గంగాపూర్ గ్రామ సర్పంచ్ నేతృత్వంలో గ్రామస్తులు, స్థానిక అధికారులు కలిసి నిరసన స్వర వినిపించారు. ఈ మేరకు చిన్నకోడూరు ఎంపీడీఓమరియు తహసీల్దార్ కి బుధవారం వినతిపత్రం సమర్పించారు.సిద్దిపేట మరియు చిన్నకోడూరు ప్రాంతాల్లో బీడీ కార్మికులు మరియు వయస్సు పైబడిన వృద్ధులు అత్యధికంగా ఉంటారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వ పెన్షన్ మాత్రమే వారికి ఏకైక ఆర్థిక భరోసాగా నిలుస్తోంది.?కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 నుండి ప్రవేశపెట్టబోయే నూతన పెన్షన్ నిబంధనలలో అర్హులైన బీడీ కార్మికులకు, వృద్ధులకు సాంకేతిక కారణాలు ( కట్ ఆఫ్ డేట్స్ ఏజ్ లిమిట్ వంటివి) సాకుగా చూపి పెన్షన్ నిలిపివేయకుండా, సమగ్రమైన మార్గదర్శకాలు రూపొందించాలని వినతిపత్రంలో స్పష్టం చేశారు.



**క్షేత్రస్థాయి సమస్యల ప్రస్తావన**

గ్రామ సర్పంచ్ స్వయంగా బాధితులతో కలిసి అధికారులను కలవడం ద్వారా ఈ సమస్య ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. అర్హులైన ఏ ఒక్క వృద్ధుడు లేదా బీడీ కార్మికుడు లబ్ధి పొందే అవకాశాన్ని కోల్పోకూడదని డిమాండ్ చేశారు.?మా గంగాపూర్ గ్రామంలోని పేద వృద్ధులు, రెక్కాడితే గానీ డొక్కాడని బీడీ మహిళా కార్మికుల సంక్షేమమే మాకు ప్రధానం. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చే పెన్షన్ పథకంలో ప్రతీ ఒక్క అర్హునికి న్యాయం జరగాలి. ఏ ఒక్కరికీ హక్కు నిరాకరించబడినా గ్రామ పంచాయతీ పరంగా నిరంతరం పోరాడతాం. తహసీల్దార్, ఎంపీడీఓ ఈవినతిపత్రాన్నిఉన్నతాధికారులకు పంపి సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం.ఈ కార్యక్రమంలో గంగాపూర్ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, బీడీ కార్మిక సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో వృద్ధులు, బీడీ మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంత స్ట్రక్చర్ తొలగింపు :





**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు,13)**

ధన్వాడ మండలం, మంత్రోనిలపల్లి, గ్రామపంచాయతీ ముందు గతంలో నిర్మించిన ఇంకుడు గుంత స్ట్రక్చర్ను డోజర్ తో లెవెల్ చేయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్షపు నీరును నిలుపుకోవడానికి ఎన్నో రకాలుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న దానికి భిన్నంగా ఇంకుడు గుంతల స్ట్రక్చర్ను తొలగించడం పై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి కె. రాఘవేందర్ ను వివరణ కోరగా గ్రామపంచాయతీ ముందు ఉన్నటువంటి మట్టిని సమానంగా చేయమని డ్రైవర్ కు చెప్పగా ఆ స్ట్రక్చర్ను డ్రైవర్ తెలియక తొలగించారని, ఈ విషయం గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకు వెళ్ళామని వాటిని మళ్లీ యధావిధిగా నిర్మిస్తామని అన్నారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరోమారు జరగకుండా మండల అధికారులు దృష్టిసాదించాలని ప్రజలు కోరుతున్నారు.

# మరికల్ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి ;



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు,13)**

మరికల్ కేజీబీవీ పాఠశాలను ప్రత్యేక అధికారి కే .సుజాత తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం ప్రత్యేకంగా పరిశీలించారు. అదేవిధంగా తరగతి గదులు శుభ్రత తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు చక్కగా చదివి, ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మిర్జా కరీముల్లా, కేజీబీవీ ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన ప్రజలారా ఏకంకండి

## దళిత సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు, బత్తుల చంద్రం.

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 12:**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన, మైనార్టీ ప్రజలు అగ్రవర్ణాల మాటలు నమ్మి మోసపోకుండా ఏకమై తమ హక్కుల కోసం పోరాడాలని దళిత సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ--ఎస్సీ--ఎస్టీ నాయకుడు బత్తుల చంద్రం పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ ఏర్పాటు విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేటతో పాటు తెలంగాణ రాష్ట్రంలో జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన, మైనార్టీ వర్గాలు ఇప్పటికీ అగ్రవర్ణాల ఆధిపత్యంలో కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు అగ్రవర్ణ ఆధిపత్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.సిద్దిపేట నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా కొందరు అగ్రవర్ణ నాయకులు దళిత, బహుజన, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన



పేదలకు డబ్బులు ఇచ్చి ఫ్లెక్సీలు కట్టించుకుంటున్నారని బత్తుల చంద్రం ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ రాజకీయ భవిష్యత్తు గురించి ఆలోచించాలని సూచించారు. మన చేతనే ఫ్లెక్సీలు కట్టించుకొని, మన ఓట్లు తమకే వస్తాయని కొందరు నాయకులు భ్రమలో ఉన్నారు. ఇకపై బహుజనులంతా ఏకమై మన రాజ్యాధికారాన్ని సాధించుకునే దిశగా ముందుకు సాగాలి అని ఆయన అన్నారు.సిద్దిపేటలో పోటీ చేయబోయే అగ్రవర్ణ నాయకులు ఏ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారో ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని బత్తుల చంద్రండిమాండ్ చేశారు .బహుజన ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులై తమ హక్కులు, అభివృద్ధి, ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు బోయ రాములు, మన ఆలోచన సాధన సమితి (బీసీ) రాష్ట్ర ప్రచార కార్యదర్శి గుడిసె ప్రభురాజ్, నాయకులు మాచవరం మహేందర్, బీసీ సీనియర్ నాయకులు, వడ్డెర సంఘం సీనియర్ నాయకుడు బోదాసు మల్లేశం, వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, కుక్కల ప్రవీణ్, పరక రవి, డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు శంకర్, సుల్తాన్ రాజు, ఏకలవ్య పాల్గొన్నారు.

# మచ్చ వేణుగోపాల్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు పరామర్శ

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 12:**

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి మాతృమూర్తి జయమ్మ గారు మరణించడం పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈరోజు సిద్దిపేటలోని మచ్చ వేణుగోపాల్ రెడ్డి నివాసానికి వెళ్లిన హరీశ్ రావు జయమ్మ గారి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాతృవియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న వేణుగోపాల్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి



ధైర్యాన్ని ప్రసాదించాలని, జయమ్మ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# అయ్యా అన్నం పెట్టమని అంటలేదు....

## - ఒక్క యూరియా సంచి ఇవ్వమంటున్న కాళ్ళు మొక్కుత....

## - కన్నీరు మున్నీరైన రైతు....

**కొల్చారం, ఆగస్టు 12(అక్షర కలం):**

మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక




వ్యవసాయ సహకార సంఘం వద్ద బుధవారం ఉదయం యూరియా మందు సంచి కోసం వచ్చిన రైతు అయ్యా నాకు అన్నం పెట్టమని అంట లేదు.... నీ కాళ్లు మొక్కుతా నాకు ఒక్క యూరియా సంచి మందు ఇవ్వు అని సహకార సంఘం లో పనిచేస్తున్న సిబ్బందిని కాలు మొక్కిన రైతు. ఆ రైతు సిబ్బంది కాలు మొక్కుతే అక్కడ ఉన్న రైతుల హృదయాలు కలచివేసిన సంఘటనలు కనిపించాయి. చిలిపిచేడ్ మండలం చిట్కుల గ్రామానికి చెందిన బోయిని రాములు అనే రైతు యూరియా కోసం వచ్చిన సారు నాకు ఫోను లేదు ఫోన్లో బుక్ చేయడం రాదు సారు అంటూ... ఎవరైనా సహాయం చేయండి అంటూ రైతు కన్నీరు పెట్టాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ నాకు ఇద్దరు కూతుళ్లే ఉన్నారు. ఎవరు తోడు లేరు నా దగ్గర చిన్న ఫోన్ మాత్రమే ఉన్నది నేను ఎలా యూరియా బుక్ చేసుకోవాలి సార్ అంటూ రంగంపేట వ్యవసాయ సహకార సంఘం ముందు తన ఆవేదనను వెళ్ళబోసుకున్నాడు. స్మార్ట్ ఫోన్ అవసరం, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులకు అధికారులు ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నాను. ఇలాంటి ఘటన ఎక్కడ జరగకుండా జిల్లా అధికారులు, మండల అధికారులు స్పందించి యూరియా బుకింగ్ చేసుకోరాని రైతులను అధికారులు ఆదుకోవాలని వివిధ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఎర్ర సత్యమన్న

## పండుగ సాయన్న తరువాత ప్రజల మనసులో బతికిన మహానాయకుడు

## మంత్రి వాకిటి శ్రీహరి

**మహబూబ్‌నగర్. ఆగస్టు 12 అక్షరకలం :**

పండుగ సాయన్న తరువాత ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానాయకుడు ఎర్ర సత్యమన్న అని రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎర్ర సత్యమన్న వర్ధంతి సందర్భంగా బుధవారం మహబూబ్‌నగర్ నగరంలోని ఎర్ర సత్యం చౌరస్తాలో ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సారథ్యంలో జడ్చర్ల ఎమ్మెల్యేగా పనిచేసిన ఎర్ర సత్యం ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడిగా ఎర్ర సత్యం ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు.

**పేదల కోసం నిలిచిన నాయకుడు**

పండుగ సాయన్న పెద్దలను ఎదిరించి పేదలకు అండగా నిలిచినట్లే, ఎర్ర సత్యం వద్దకు వెళ్తే పేదలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉండేదని మంత్రి గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎప్పుడూ ముందుండేవారని, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత, సేవాభావం, ధైర్యం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎర్ర సత్యం పదవిని అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు ఉపయోగించుకున్నారని మంత్రి



అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు.

**ప్రజల కోసం నిర్భయంగా పోరాడిన నాయకుడు**

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎర్ర సత్యం గొప్ప ధైర్యశాలి, ప్రజల కోసం నిలబడిన నిజమైన ప్రజానాయకుడని అన్నారు. ప్రజా సమస్యలపై నిర్భయంగా పోరాడిన ఆయన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల కష్టాలు, సమస్యల పరిష్కారానికి ఎర్ర సత్యం చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**ఘనంగా నివాళులు**

ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎర్ర సత్యం అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర క్రీడల చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పి. వెంకటేష్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి గోనెల శ్రీనివాసులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, జహీర్ అక్తర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బెక్కెరి మధుసూదన్ రెడ్డి, నాయకులు శేఖర్ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శులు బుద్దారం సుధాకర్ రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సాయిబాబా, ఎన్.పి. నేహా, మైత్రి యాదయ్య, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎర్ర సత్యం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఆటో నడిపిన వ్యక్తికి 3 రోజుల జైలు

మహబూబ్‌నగర్. ఆగస్టు 12 అక్షర కలం : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 8 మందిని పోలీసులు గుర్తించారు. వారిని సెకండ్ క్లాస్ కోర్టు గౌరవ న్యాయమూర్తి ఆర్.శశిధర్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం 7 మంది ద్విచక్ర వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారు. అదే సమయంలో మద్యం సేవించి ఆటో నడిపిన పూజారి రమేష్, పూజారి తండా, హన్వాడ మండలానికి చెందిన ఆటో డ్రైవర్‌కు న్యాయస్థానం 3 రోజుల జైలు శిక్ష విధించింది.



**మద్యం సేవించి వాహనం నడపడం నేరమే కాదు.. ప్రాణాలకు ముప్పు**

మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వాహనంలో ప్రయాణిస్తున్న వారితో పాటు రహదారిపై వెళ్లే అమాయకుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఇకపై కూడా నిరంతరం తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. "మద్యం సేవించి వాహనం నడపవద్దు.. మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడండి" అని జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దేశంలో కార్మిక రాజ్యం కోసం పోరాడిన - విప్లవకారుడు సీతారాం ఏచూరి

**అక్షర కలం/ సింగరేణి:**

భారతదేశంలో నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా మార్క్సిజాన్ని అన్వయించి అనేక ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేసిన నిజమైన విప్లవకారుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సీతారాం ఏచూరి 74వ జయంతి కార్యక్రమం సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం మొదలుకొని సీపీఎం ఆల్ ఇండియా కార్యదర్శిగా ఎన్నిక అయ్యే



అంతవరకు ఆయన సుదీర్ఘ ప్రస్థానం సాగిందని నిత్య అధ్యయనశీలి నిరంతరం పేదల కోసం ఈ దేశంలో కార్మిక వర్గ రాజ్యం కోసం కృషిచేల్చిన ఏచూరి జీవితం ధన్యమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని మార్చాలని మొత్తం స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలని నిర్వీర్యం చేస్తూ సమస్త వర్గాల ప్రజల చట్టాలను హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకే ప్రజా సంపదను అప్పనంగా దోచిపెడుతూ పేదలను మరింత పేదలుగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి దేశాన్ని సాగిలపడే విధంగా వ్యవహరిస్తున్న పాలకులు ఉండి ప్రధాని హోంమంత్రి ప్రజలకు సమాధానం చెప్పలేక పార్లమెంట్ కు హాజరు కాకుండా మీడియాకు ముఖం చాటేస్తు ప్రజా తీర్పును రాజ్యాంగాన్ని చట్టాలను అపహస్యం చేస్తున్న నేటి పరిస్థితుల్లో సీతారామ ఏచూరి లేకపోవడం భారతదేశ ప్రజానీకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955